క్లుప్తంగా

సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్లలోని గేమ్‌లకు అలవాటు పడితే చదువు కుంటుపడి, జీవితం నాశనం అవుతుందని ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం ఆయన వీఎస్ పురంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సెల్‌ఫోన్లు, టీవీలు చూడడంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టిని కేంద్రీకరించినప్పుడు ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని తెలిపారు. సమాజంలో చదువుతోనే ఉన్నత స్థానం పొందుతారన్నారు.

అంబారీపై ముక్కంటి రాజసం



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: కార్తీక మాసం సందర్భంగా జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారు శుక్రవారం అంబారీపై ఊరేగారు. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ చేసి, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల నడు అంబారీపై కొలువుదీర్చారు. తరువాత పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. శాశ్వత ఉభయ దాతలుగా చెంబేడుకు చెందిన ఆబాక రంగనాయకమ్మ వ్యవహరించారు.

వేడుకగా సుబ్రమణ్యస్వామి కల్యాణం



స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సత్యవేడు: స్థానిక సుబ్రమణ్యస్వామి ఆలయంలో స్కంధషష్ఠి సందర్భంగా శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్యాణం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు వేకువ జామునుంచే అభిషేక పూజలు చేశారు. అనంతరం హోమం పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు విశేషాలంకరణ చేసి, వేదికపై కొలువుదీర్చి, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ అర్చకులు మాంగల్యధారణ చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. అర్చకులు భాస్కర్, రామమూర్తి, జయరాం, గులపల భాస్కర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు.

ఆర్థికసాయం



నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

వరదయ్యపాళెం: ఇటీవల శిల్పారామంలో రంగులరాట్నం నుంచి కిందపడి మరణించిన గౌతమి కుటుంబ సభ్యులకు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆర్థికసాయం అందజేశారు. కేవీబీపురం మండలం పెరిందేశం గ్రామానికి చెందిన గౌతమి వారం రోజుల క్రితం తిరుపతి అర్బన్ హాట్‌లో రంగులరాట్నంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మరణించిన విషయం తెలిసిందే. ఈ సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రమాదానికి కారణమైన అర్బన్ హాట్ నిర్వాహకులను సంప్రదించి, తక్షణ సాయం కింద వారు ప్రకటించిన రూ. 50 వేలు ఆర్థికసాయం చెక్కును శుక్రవారం పెరిందేశం గ్రామంలోని మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ శ్రేణులు ఇలంగోవన్ రెడ్డి, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



నారాయణవనం: మండలంలోని సముదా యం వీధుల్లో శుక్రవారం రాత్రి సక్కుభాయి సమేత పాండురంగస్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో 30 మంది బాలికలకు పాండురంగ భజన మండలి కోలాటం నేర్పింది. శిక్షణ తరగతుల్లో చివరి రోజైన శుక్రవారం సాయంత్రం బాలికలు, మండలి సభ్యులు అగ్నిగుండ ప్రవేశం చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పాండురంగస్వా మిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. రాత్రి పది గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలను, కోలా ట ప్రదర్శన ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అంగన్ బేడీలు

వీటి కంటే జైళ్లే నయం

చిన్నారుల వికాసానికి..పూర్వ ప్రాథమిక విద్యకు వేదికైన అంగన్‌వాడీ కేంద్రాలు భవన వసతి లేక కునారిల్లుతున్నాయి. గాలి, వెలుతురు లేని రేకుల షెడ్లు, అద్దె గదుల్లో నడుస్తున్నాయి. కొన్ని చోట్ల గ్రామచావడిలో నిర్వహిస్తున్నారు. ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఇంటిని మరిపించాలని, అమ్మ ఒడిని తలపించాలని పాలకులు, అధికారులు చెబుతున్న మాటలు నీటి మూటలుగా మిగులుతున్నాయి. వసతులు లేని ఈ కేంద్రాలకు చిన్నారులు వెళ్లడం మానివేశారు. ఈ దారుణ పరిస్థితికి మండలంలోని కేంద్రాలే నిదర్శనం.

- రేకుల షెడ్లలో నిర్వహణ
- ఉక్కపోతతో చిన్నారుల ఉక్కిరి బిక్కిరి
- చెమ్మగిల్లుతున్న బాల్యం

నారాయణవనం: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు భవన వసతి లేకపోవడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 40 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 12 కేంద్రాలకు భవన వసతి లేకపోవడంతో చిన్నారులు ఇక్కట్లు పడుతున్నారు. నారాయణవనంలో అంగన్‌వాడీ కేంద్ర భవనం నాలుగేళ్లుగా నిర్మాణం కొనసాగుతూనే ఉంది. దీంతో కేంద్రాన్ని ఓ రేకుల షెడ్‌లో నడుపుతున్నారు. ఫలితంగా చిన్నారులు ఉక్కపోతతో ఉడికిపోతున్నారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారు. తమ బిల్లులు రాకపోవడంతోనే పనులు పూర్తి చేయలేదని కాంట్రాక్టర్ చెబుతున్నారు. నారాయణవనంలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు కేంద్రాలు అద్దెకు రేకుల షెడ్లలో నడుస్తున్నాయి. మినీ అంగన్‌వాడీ కేంద్రం మాత్రం కార్యకర్త తన సొంత ఇంట్లో నడుపుతోంది. కేంద్రం నిర్వహణకు ఐసీడీఎస్ సంస్థ నెలకు రూ.700 చెల్లించి చేతులు దులుపుకుంటోంది.

విద్యకు దూరమైన పిల్లలు

బీసీ కాలనీలో అంగన్‌వాడీ కోసం దాతలు రూ.లక్షల విలువైన భవనాన్ని అందజేశారు. ఆ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నాలుగేళ్ల క్రితం రూ.14.5 లక్షల అంచనా వ్యయంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. దీంతో నారాయణవనం–2 కేంద్రాన్ని రేకుల షెడ్‌లో నడుపుతున్నారు. వసతులు లేని రేకుల షెడ్‌లో ఉక్కపోతను తట్టుకోలేక 30 మంది చిన్నారులు కేంద్రానికి రావడం మానేశారు. దీంతో చిన్నారులు విద్యకు దూరమయ్యారు. 20 మందితో నడుస్తున్న కేంద్రం నిర్వహణకు నెలకు రూ.3వేలు వెచ్చిస్తున్నారు. ఐసీడీఎస్ రూ.700 మాత్రమే మంజూరు చేస్తే, కార్యకర్త, వర్కర్ తమ చేతి నుంచి రూ.2,300 నెల నెలా భరిస్తున్నారు. మూడో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేక గ్రామచావడికి చెందిన రేకుల షెడ్‌లో నడుపుతున్నారు. నాలుగో కేంద్ర రెడ్డి వీధిలో అద్దెకు రేకుల షెడ్‌లో నడుస్తోంది. 20 మంది చిన్నారులు రేకుల కింద ఉక్కపోతను భరించలేకున్నారు. సొంత భవనానికి వీధి చివరలో 2 సెంట్ల స్థలంలో స్థానికులు ప్రతిపాదించారు. స్థలం సరిపోదంటూ సంబంధిత శాఖలు కొత్తభవనాన్ని మంజూరు చేయలేదు.



గ్రామ చావడిలో నడుస్తున్న కేంద్రం



రేకుల షెడ్‌లో బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం



రేకుల షెడ్‌లో నడుస్తున్న రెడ్డి వీధి కేంద్రం

ఇంత నిర్లక్ష్యమా?

కాంట్రాక్టర్‌కు ఇప్పటికే రూ.11 లక్షలకు బిల్లులను చెల్లించారు. అసంపూర్తి పనులను పూర్తి చేసి అప్పగిస్తే మండల పరిషత్ మరో రూ 2 లక్షలను విడుదల చేయడానికి సిద్ధంగా ఉంది. చివరి బిల్లుగా పంచాయతీ నుంచి మరో రూ.1.5 లక్షల చెల్లింపునకు అధికారులు హామీ ఇచ్చారు. అయినా కాంట్రాక్టర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయడంపై శ్రద్ధ చూపడం లేదని అధికారులే అంటున్నారు. నాలుగేళ్లుగా పూర్తి కాని అంగన్‌వాడీ–2 భవన నిర్మాణాన్ని పూర్తి చేయించడంలో ఐసీడీఎస్ అధికారులు నిర్లక్ష్యం వహించడం పిల్లలకు శాపంగా మారింది. తమ పిల్లల భవిషత్తు కోసం అప్పులు చేసి ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారు. ఆర్థిక స్థోమతే లేక రేకుల షెడ్‌లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు భారంగా తల్లిదండ్రులు తమ పిల్లలను పంపుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కాంట్రాక్టర్‌పై ఒత్తిడిపెంచి నిర్మాణ పనులను పూర్తి చేసి కేంద్రాన్ని ప్రారంభిస్తామని ఐసీడీఈఎస్ సూపర్‌వైజర్ బేబీ పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన తెలుపుతున్న వీఓఏలు

శ్రీకాళహస్తి: వెలుగు శాఖ పరిధిలో పనిచేస్తున్న సంఘమిత్రల(వీఓఏ)కు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ అనుబంధ వీఓఏ ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం తొట్టంబేడు రెవెన్యూ కార్యాలయం వద్ద వెలుగు వీఓఏలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకుడు వేణు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. వీఓఏల ఉద్యోగ భద్రత కోసం హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తొలగించిన వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలన్నారు. వీఓఏలపై రాజకీయ వేధింపులు విడనాడలన్నారు. అనంతరం తహసీల్దార్ మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన మహోత్సవం

శ్రీకాళహస్తి: పట్టణంలోని భరద్వాజ తీర్థంలో అవధూత శివశంకర్ వేణుగోపాలస్వామి 47వ ఆరాధన మహోత్సవాన్ని శ్రీసత్యవ్రత భాస్కర క్షేత్ర అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, గరికపాటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధుల దుర్వినియోగం

- రికవరీకి సిఫార్సు రూ. 111,153
- రూ. 54 వేల జరిమానా



సామాజిక తనిఖీ సభలో పాల్గొన్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

సత్యవేడు: ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలో రూ.1,65,153 దుర్వినియోగం జరిగిందని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ సభ జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ఈజీఎస్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్‌లో జరిగిన 756 పనులకు రూ.12,12,4,238 ఖర్చు చేసినట్లు తెలిపారు. 27 పంచాయతీల పరిధిలో 62 హ్యాబిటేషన్ గ్రామాల్లో వివిధ రకాల పనులు జరిగాయన్నారు. వీటిలో జరిగిన అవినీతికి సంబంధించి రూ. 111,153 రికవరీకి ఆదేశించామన్నారు. అలాగే అవినీతికి పాల్పడిన వారికి రూ. 54 వేల జరిమానా కూడా విధించామన్నారు. మస్టర్లలో గర్భిణులు, అంగ్‌వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు పేర్లు నమోదు చేసి ఉండడంతో శిరుణంబూదూరు, పీవీ పురం ఫీల్డు అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీ ఎస్. చంద్రశేఖర్, ఏపీడీ ప్రేమ్‌కుమార్(శ్రీకాళహస్తి), ఏపీఓ కృష్ణయ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్లు తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. అందులో భాగంగా 33/11కేవీ సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పిచ్చాటూరులో..

నాగలాపురం: పిచ్చాటూరు మండల కేంద్రంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీ రమేష్ చంద్ర, ఏఈ రవి తెలిపారు. సబ్ స్టేషన్లలో మరమ్మతు కోసం మండలంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనునట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి: ప్రతి విద్యార్థీ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని 12వ జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. న్యాయసేవ దినోత్సవంలో భాగంగా పట్టణంలోని ధర్మరాజుల ఆలయం ఎదురుగా ఉన్న బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు.

బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలనకు కృషి



ఏర్పేడు: మాట్లాడుతున్న ఎంపీడీఓ సౌభాగ్యం

ఏర్పేడు(రేణిగుంట): బాల్యవివాహ వ్యవస్థ నిర్మూలనకు సమష్టి కృషి చేయాలని ఎంపీడీఓ సౌభాగ్యం అన్నారు. ఏర్పేడు ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం బాల్యవివాహ వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలతో పలు అనర్థాలు కలుగుతాయన్నారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసులు, ఏర్పేడు సీఐ జయచంద్ర, ఎంఈఓ ప్రేమలత పాల్గొని, మహిళలపై జరుగుతున్న అఘాత్యాలు, బాల్యవివాహాలు, గంజాయి వంటి సామాజిక రుగ్మతలపై సమీక్షించారు.

15 వరకు తపాలా శాఖ ప్రత్యేక శిబిరాలు

నారాయణవనం: ప్రతి సచివాలయం పరిధిలో ఐపీపీబీ ఖాతాలు తెరిచేందుకు, ఎన్పీసీఐ యాక్టివేషన్ కోసం ఈ నెల 15వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు పుత్తూరు సబ్ డివిజన్ తపాలా ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల ఫలాలను లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమచేయనున్నట్లు చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వ సామాజిక ప్రయోజనాలు పొందేందుకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) లబ్ధిదారుల బ్యాంకు, తపాలా ఖాతాలకు తప్పనిసరిగా ఎన్పీసీఐ లింక్ కలిగి ఉండాలన్నారు. పుత్తూరు సబ్ డివిజన్ పరిధిలో పుత్తూరు, నగరి, విజయపురం, నింద్ర, పిచ్చాటూరు, నాగలాపురం, నారాయణవనం, కార్వేటినగరం, వడమాలపేట మండలాల్లో 22,127 మంది తమ ఖాతాలకు ఎన్‌సీపీఐ మ్యాపింగ్, ఆధార్ అనుసంధానం కాకపోవడంతో వారికి సంక్షేమ పథకాలు అందే అవకాశాలు లేవన్నారు. ఎన్‌పీసీఐ యాక్టివేషన్‌కు సంబంధించి తపాలా శాఖలో ఖాతా ఉంటే వెంటనే లింక్ చేయించుకోవాలని, ఖాతా లేనివారు ఆధార్ నంబరుతో సమీపంలోని తపాలా కార్యాలయంలో ఖాతా తెరిస్తే మూడు రోజుల్లో ఎన్పీసీఐ యాక్టివేషన్ అవుతుందన్నారు.

అలరించిన నృత్యప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాంగణంలో బ్రహ్మగుడి వద్ద కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించింది. విజయవాడకు చెందిన విశ్వనాథ్ అకాడమి విద్యార్థులు పలు శివకీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. వారికి ఆలయాధికారులు జ్ఞాపికలు, తీర్థప్రసాదాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన రేషన్‌బియ్యం వద్ద సీఐ, తహసీల్దార్, ఎస్ఐలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వేణుగోపాలపురంలో అక్రమంగా తరలిస్తున్న 40 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వేణుగోపాలపురం గ్రామానికి చెందిన వంశీ, లోకేష్, మహేష్, రెండు ఆటోలు, మినీలారీలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గురువారం సమాచారం వచ్చిందన్నారు. దీంతో గ్రామంలోని గంగమ్మగుడి వద్ద తనిఖీలు చేపట్టి వాహనాలు, 40 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి బియ్యాన్ని తహసీల్దార్ సుబ్రమణ్యంకు అప్పగించామన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు నాగరాజు, హరి, కానిస్టేబుళ్లు ప్రభాకర్, వరముని, వీఆర్‌ఓ మురళి, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజాపోరు’ను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం చేపడుతున్న ప్రజాపోరు ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శుక్రవారం ప్రజాపోరు కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల రద్దు, ఉచిత ఇసుక అమలు, నిత్యావసర ధరల తగ్గింపు, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ, నిరుద్యోగ భృతి, విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ తదితర అంశాలపై సీపీఎం చేపడుతున్న ప్రజాపోరును జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, వెంకటేష్, గురునాథం, అన్వర్‌బాషా, భారతి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ జగదీష్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



డాక్టర్ జగదీష్‌కు అవార్డును అందజేస్తున్న మాజీ మంత్రి గల్లా అరుణకుమారి

రేణిగుంట: డాక్టర్ రామచంద్ర నాయుడు గల్లా జీవిత సాఫల్య పురస్కారం అవార్డును డాక్టర్ జగదీష్‌కు మాజీ మంత్రి గల్లా అరుణకుమారి చేతుల మీదుగా అందజేశారు. క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ పదో వార్షికోత్సవ పోటీ సమావేశాలు చైర్మన్ జగన్‌మోహన్ ఆధ్వర్యంలో ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మన రాష్ట్రం నుంచే కాకుండా దేశంలోని వివిధ సంస్థల నుంచి దాదాపు 2 వేల మంది హాజరయ్యారు. తిరుపతి బర్డ్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ ఆరోగ్య రంగంలో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా – ×డాక్టర్ రామచంద్ర నాయుడు గల్లా జీవిత సాఫల్య పురస్కారం౯ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. అలాగే పలువురు పారిశ్రామిక వేత్తలకు అవార్డులను అందజేశారు. ఏపీఐఐసీ చీఫ్ జనరల్ మేనేజర్ ఐఎల్ రామ్, ఎస్వీ కాలేజీ చైర్మన్ గంగి రెడ్డి, అమరరాజ చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ ఢిల్లీబాబు, బ్లిస్ హోటల్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, రాక్మెన్ కంపెనీ చీఫ్ జనరల్ మేనేజర్ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నాలమ్మకు వెండి బిందె బహూకరణ



వెండి బిందెను అందజేస్తున్న దాత

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్‌లో ఉన్న పొన్నాలమ్మకు ఓ దాత వెండి బిందెను బహూకరించారు. ఏర్పేడు మండలం చిన్న అంజిమేడు గ్రామానికి చెందిన కందాటి రాధిక, కందాటి లావిత్ సుమారు రూ.2 లక్షలు విలువ చేసే వెండి బిందెను ఆలయ చైర్మన్ పుదూరు లక్ష్మణరెడ్డికి శుక్రవారం అందజేశారు. వారికి ఆలయ పూజారి జగదీష్ దర్శన ఏర్పాటు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత



ర్యాలీ చేస్తున్న కార్మిక శాఖ అధికారులు

రేణిగుంట : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన మనందరి బాధ్యత అని తిరుపతి అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీమన్నారాయణ అన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రేణిగుంటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు దుకాణాల్లో ఎవరైనా బాల కార్మికులు పని చేస్తున్నారా? అని తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సహాయ కమిషనర్ చిన్న లాలెప్ప, రాజయ్య, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కలశ స్థాపన



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఆర్చీలు



ఏడుగంగమ్మల ఆలయంలో కలశ స్థాపన పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: ముత్యాలమ్మ గుడివీధిలోని ఏడుగంగమ్మల ఆలయ మహాకుంభాభిషేకంలో భాగంగా శుక్రవారం శాస్త్రోక్తంగా కలశస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా హోమపూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి పాల్గొన్నారు. కాగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఆర్చీలు ఆకట్టుకుంటున్నాయి

యూరియా కోసం బారులు తీరిన రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని రసాయనిక ఎరువుల దుకాణాల వద్ద శుక్రవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. రబీ సీజన్ మొదలు కావడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. వరి పంట సాగు కోసం స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో యూరియా లేక పోవడంతో బుచ్చినాయుడుకండ్రిగలోని దుకాణాల వద్ద రైతులు క్యూ కట్టారు. దుకాణాల్లో యూరియా స్టాకు అంతంతమాత్రంగానే ఉండడంతో రైతులు బారులు తీరారు. యూరియా కోసం దుకాణాల లోపల రైతుల మధ్య తోపులాట జరిగింది. 11 గంటలకు దుకాణాలలో యూరియా అయిపోవడంతో రైతులు వెనుదిగారు. ఎప్పుడో ఒక లోడ్ ఎరువులు వస్తున్నాయని, అవి గంటలోపు అయిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆర్బీకేల వద్ద ఎరువులు దొరికేవని, ఇప్పుడు ఎరువుల కోసం నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో ఎరువులను సరఫరా చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి యూరియాను అవసరం మేరకు రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేయాలని రైతులు కోరారు.





దుకాణంలో యూరియా కోసం తోసులాడుతున్న రైతులు, దుకాణం వద్ద బారులు తీరిన రైతులు

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ అధికారి నరసింహరావు

సత్యవేడు: సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సైబర్ క్రైమ్ అధికారి నరసింహరావు అన్నారు. శుక్రవారం సత్యవేడు సీఐ మురళి నాయుడు అధ్యక్షతన సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు స్థానిక మస్తాన్ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ అధికారి నరసింహరావు మాట్లాడుతూ నేడు నిత్యజీవితంలో సెల్‌ఫోన్, ఇంటర్నెట్ వినియోగం యువతలో అత్యధికంగా జరుగుతోందన్నారు. సైబర్ నేరగాళ్లు యువతను టార్గెట్‌గా చేసుకుని గేమింగ్, సోషల్ మీడియాలో కంటెంట్‌ను అప్‌లోడ్ చేయడం, షాపింగ్ వెబ్‌సైట్లు, ఫేక్ న్యూస్, డేటింగ్ యాప్‌లపై యువత అప్రమత్తంగా ఉండకపోవడంతో మోసపోతున్నారని హెచ్చరించారు. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియో, హాట్ స్టార్ తదితర వినోదం కోసం తమ మొబైల్ ఫోన్లు వినియోగించేవారు మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. డిజిటల్ సాంకేతిక జ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవడానికి వినియోగించుకోవాలే తప్ప, నేర ప్రవృత్తి వైపు వెళ్లడం సముచితం కాదన్నారు. ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో ఇన్స్టాగామ్, ఫేస్‌బుక్, ట్విటర్, వాట్సాప్ వంటివి వినియోగిస్తున్నప్పుడు కొత్త వ్యక్తులతో చాటింగ్ చేసుకోవడం భవిష్యత్తులో మోసానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. దీంతో వ్యక్తిగత సమాచారం కూడా సైబర్ నేరగాళ్లు అందిపుచ్చుకుంటారన్నారు. 10 సంఖ్యల కన్నా అధికంగా ఉన్న సంఖ్యలతో వారి వారి అకౌంట్లు సేఫ్ జోన్లలో ఉంచుకోవాలన్నారు. తరచూ పాస్‌వర్డ్ కూడా మార్చుకోవాలన్నారు. వాట్సాప్‌లో వచ్చే లింకులను క్లిక్ చేస్తే వైరస్ ప్రవేశించి మొబైల్‌లోని సమాచారం అంతా సైబర్ నేరగాళ్లకు అందుతుందన్నారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి ఫోన్‌లో ఓటీపీ అడిగితే చెప్పవద్దని, చెబితే బ్యాంకు ఖాతాలోని నగదు మాయం చేస్తారన్నారు. గూగుల్ ప్లేస్టోర్లో తప్ప ఇతర మార్గాల్లో యాప్‌లు డౌన్‌లోడ్ చేయవద్దన్నారు. సీఐ మురళి నాయుడు మాట్లాడుతూ మహిళలు వేధింపులకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందిస్తే సమీపం పోలీసులు వెంటనే వచ్చి ఆకతాయిల నుంచి రక్షణ కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రామస్వామి, మల్లికార్జున్, సునీల్, బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వసుంధర, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.